# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గణేశ చతుర్థి సందర్భంగా భారతీయులందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ భారత్ లో తయారయ్యే ఎలక్ట్రిక్ వాహనాలు ఇకపై 100 దేశాలకు ఎగుమతి అవుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేశారు.
- ❖ "ఆత్మనిర్భర్ భారత్" దార్శనికతకు ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధనౌకలు నిదర్శనమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ సుదర్శన్ చక్ర దేశ పౌరులకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు.

========================

గణేశ చతుర్థి సందర్భంగా దేశ విదేశాల్లోని భారతీయులందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాష్ట్రపతి ఒక సందేశంలో ఈ విధంగా పేర్కొంటూ.. భగవాన్ గణేశుని జ్ఞానాధిపతిగా, శ్రేయోనిధిగా ఆరాధిస్తామని, ఏదైనా కొత్త పనిని మొదలుపెట్టేటప్పుడు ఆయన ఆశీర్వాదాలు కావాలని కోరుకుంటామని అన్నారు. మన పర్యావరణాన్ని కాపాడుకుంటూ స్వచ్ఛ హరిత, సమృద్ధితో కళకళలాడే దేశాన్ని నిర్మించే మార్గంలో కలిసికట్టుగా ముందుకు సాగే ఉద్దేశంతో ఈ పండుగను జరుపుకుందామని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

========================

స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ ఆత్మనిర్భరత దిశగా సాగుతున్న ప్రయాణంలో కీలకమైన హరిత రవాణా కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో ప్రారంభించారు. గుజరాత్‌లోని టిడిఎస్ లిథియం-అయాన్ బ్యాటరీ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తిని ప్రారంభించిన అనంతరం సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... గణనాథుని పండుగ వాతావరణం మధ్య 'మేడిన్ ఇండియా' ప్రయాణంలో ఇది ఒక నూతన అధ్యాయమని పేర్కొన్నారు. "భారత్ లో తయారీ.. ప్రపంచం కోసం తయారీ" అనే ఉమ్మడి లక్ష్యం వైపు ఇదొక ముఖ్యమైన ముందడుగు అని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో తయారయ్యే ఎలక్ట్రిక్ వాహనాలు ఈ రోజు నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి అవుతాయని నరేంద్ర మోదీ తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

దేశంలో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్ తయారీని కూడా ప్రారంభిస్తున్నామని ప్రధానమంత్రి ప్రకటించారు. ఎలక్ట్రిక్ వాహన వ్యవస్థలో బ్యాటరీ అత్యంత కీలకమైన భాగమని, ఇది వరకు భారత్ బ్యాటరీలను పూర్తిగా దిగుమతి చేసుకునేదని గుర్తు చేశారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీని బలోపేతం చేసేందుకు భారత్‌లో దేశీయంగా బ్యాటరీ ఉత్పత్తిని ప్రారంభించడం చాలా అవసరమని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=========================

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన "వైబ్రంట్ విలేజెస్" కార్యశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... సరిహద్దు ప్రాంతాలలో అక్రమ చొరబాట్లు దేశ భద్రతను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయన్నారు. సరిహద్దు గ్రామాల వెంబడి వలసలను నియంత్రించేందుకు వైబ్రంట్ విలేజెస్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమం సరిహద్దు గ్రామాలలో మౌలిక సదుపాయాలు, సంస్కృతి పరిరక్షణ, పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధిని పెంచుతుందన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో వైబ్రంట్ విలేజెస్ కార్యక్రమాన్ని అమలు చేసిన తర్వాత అనేక సరిహద్దు గ్రామాలలో జనాభా పెరిగిందని ఆయన గుర్తు చేశారు.

=========================

విశాఖపట్నంలోని తూర్పు నావల్ కమాండ్‌లో ఈరోజు మధ్యాహ్నం భారత నావికాదళానికి చెందిన రెండు అధునాతన ఫ్రంట్‌లైన్ ఫ్రిగేట్స్ ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరిలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశంలోని ప్రతిష్టాత్మక షిప్‌యార్డ్స్ నుండి రెండు ప్రధాన ఉపరితల పోరాట నౌకలను ఒకేసారి ప్రారంభించడం ఇదే తొలిసారి అని చెప్పారు. అధునాతన యుద్ధనౌకలను అందించగల భారతదేశ సామర్థ్యాన్ని ఇది తెలియజేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా`, 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలకు ఈ యుద్ధనౌకలు నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 28వ తేదీ గురువారం సాయంత్రం అధికారిక పర్యటన నిమిత్తం జపాన్ కు బయలుదేరుతారు. 29, 30వ తేదీల్లో జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబాతో కలిసి 15వ ఇండియా-జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించనున్నారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి తెలిపారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో విలేకరులకు ప్రధానమంత్రి పర్యటన వివరాలను వెల్లడిస్తూ... ఈ వార్షిక శిఖరాగ్ర సమావేశం ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించేందుకు ఇరువురికీ అవకాశం కల్పిస్తుందన్నారు. జపాన్ పర్యటన అనంతరం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా టియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సదస్సుకు నరేంద్ర మోదీ హాజరవుతారు.

=========================

భారతదేశపు సొంత ఐరన్ డోమ్ 'సుదర్శన్ చక్ర' దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలను రక్షించడంతో పాటూ పౌరులకు ఇది ఒక రక్షణ కవచంలా పని చేస్తుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఈరోజు మధ్యప్రదేశ్‌లోని ఆర్మీ వార్ కాలేజ్ లో 'రన్ సంవాద్-2025' అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... సుదర్శన్ చక్ర బలమైన మౌలిక

సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటూ శత్రువుల ఎయిర్ వెక్టార్స్ ను గుర్తించి వాటిని తటస్థీకరిస్తుందని చెప్పారు. “ఆపరేషన్ సిందూర్” నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆధునిక ఘర్షణలను ఎదుర్కోవడానికి భారత్ సమాయత్తమవుతుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఇందుకోసం త్రివిధ దళాలు కలిసి పని చేస్తున్నాయన్నారు. రక్షణ వ్యవస్థలను, ఆయుధశక్తిని మరింత బలోపేతం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే 2035 నాటికి సుదర్శన్ చక్రను సిద్ధం చేస్తోందని అనిల్ చౌహాన్ పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

=========================

కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్ వేదికగా జరుగుతున్న 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. భారత్ ఇప్పటికే 50 మెడల్స్ దాటి పతకాల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ దండ స్వర్ణ పతకం గెలుచుకుంది. చైనా, కువైట్‌లను అధిగమించి ప్రీతి రాజక్‌తో కలిసి నీరూ దండ, ఆషిమా భారత బృందం కూడా స్వర్ణ పతకం గెలుచుకుంది. ఇక కొద్ది సేపటి క్రితం 50 మీటర్ల విభాగంలో సిఫ్ట్ కౌర్ సమ్రా మరో స్వర్ణ పతకాన్ని సాధించింది. శుక్రవారంతో ఈ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ ముగియనుంది.

=========================

పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో వర్షాలు నిరంతరాయంగా కురుస్తున్నాయి. దీంతో రావి, బియాస్, సట్లెజ్ నదులు ఉప్పొంగి ప్రవహించడంతో ఫజిల్కా, గురుదాస్‌పూర్, హోషియార్‌పూర్, కపుర్తల, ఫిరోజ్‌పూర్‌లోని పలు ప్రాంతాలలో వరదలు సంభవించాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరికల నేపథ్యంలో ఈ వరదలకు అత్యంత ప్రభావితమయ్యే 20 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

=========================
=========================